**శ్రీ రమణ జ్యోతి**

ఏప్రిల్ 2020

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

April 2020

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 69వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్ సేవలో** | జి. శ్రీహరిరావు | 9 |
| **3.** | **అనుస్మరణీయులు** | విడపనకంటి ప్రదీప్‌చంద్ర | 16 |
| **4.** | **శ్రీరమణ మానసము** | బిరుదవోలు లక్ష్మమ్మ | 20 |
| **5.** | **శ్రీరమణమహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 23 |
| 6. | Gaining Contentment | Dr.K. Subrahmanian | 30 |
| 7. | Don't Make Sankalpas | Vimal Balasubrahmanyan | 42 |
| 8. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 44 |
| 9. | Coming Home: Getting introduced to Bhagavan's teaching | Swagat Patnaik | 47 |


## Events in Sri Ramana Kendram in April 2020

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 2nd & 29th April - Punarvasu Satsang - 6.00 - 7.30 p.m.
4. 11th April (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ఆశ, భయం

డా॥ కే.యస్. గారి 69వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## సామాన్య సమస్య

ఎంతో భిన్నమైన పరిసరాల మధ్య జీవించే ప్రజానీకంలో, ప్రతి ఒక్కరు వివిధమైన ప్రజ్ఞాపాటవాలను కలిగి వుంటారు, రకరకాలైన వృత్తి ఉద్యోగాలను చేస్తుంటారు. మనకు స్వంత మనసులు, శరీరాలు ఉంటాయి. వీటిలో ఏకరూపత వుండదు. శారీరక, మానసిక, ఆధ్యాత్మికతలలో ఎన్నో భేదాలుంటాయి. ఈ తేడాలు కొట్టొచ్చినట్లుంటాయి. కొందరు ధనవంతులు, కొందరు పేదలు, కొందరు బుద్ధికుశలతగల వారైతే, కొందరు అంత తెలివితేటలు లేనివారు. ఇలాగ ప్రపంచంలోని ప్రజల్లో పలు భేదాలు అగుపడతాయి.

కాని ఇంత విభిన్నమైన పరిస్థితుల్లో వున్న వారందరిలోను కూడ ఒక సాధారణమైన విషయం కనిపిస్తుంది. అదే భయం అనే సమస్య. మన హోదా ఏదైనా కాని, సంపదలు ఎంతైనా వుండనీ, ఏదో ఒక విషయం గురించి అందరూ భయపడుతూనే వుంటారు. అది ఎప్పుడో వచ్చి పోయేది కాదు, ప్రతి నిత్యం వుండేది. మరో మాటలో చెప్పాలంటే మనందరిలో సామాన్యమైన లక్షణం 'భయం'. మనం మరణాన్ని గురించి భయపడతాము. ఉద్యోగం దొరకక పోవచ్చునన్న భయం, మన పిల్లలు మనం అనుకున్నంత

మేరకు వృద్ధిలోకి రాలేరోమోనన్న భయం, మనం బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించకముందే చనిపోతామన్న భయం, మనకు కావలసిన వారికి ఏ హాని కలుగుతుందోనన్న భయం... ఆఖరుకు బయటకు వెళ్ళిన భార్య, పిల్లలు సమయానికి తిరిగి రాకుంటే కూడ ఏమైందోనన్న భయం. ఇలా రోజు గడిచే సరికి ఈ కారణంగా అలసిసొలసి పోవడం జరుగుతుంది. ప్రతి రోజూ వుండే సమస్య, అందరికీ వుండే సమస్య 'భయం'.

యథార్థానికి, మనం రోజంతా భయపడేది, ఆ రోజున జరిగే దాని వల్ల కాదు, ఏమి జరగవచ్చు, జరిగియుండ వచ్చునన్న దాని గురించిన మన ఆలోచనలే. అలాంటి సమయంలో ఎవరో వచ్చి, భయపడాల్సిన పనిలేదు, ఏమీ కాదన్న భరోసా ఇచ్చినప్పటికీ, ఆ నమ్మకం కొద్ది సమయం మాత్రమే వుండి మరలా భయం వేస్తుంది. ఏమీ తోచని ఆ స్థితిలో భగవంతుడిని ప్రార్థించాలన్న మరొక ఆలోచన తలెత్తుతుంది. పరిస్థితి చక్కబడిన తరువాత శాంతం చోటు చేసుకుంటుంది. కాని ఆ అలజడి సమయంలో అనుభవించినది మళ్ళీ ఏర్పడకూడదని అనుకుంటాము. పై అధికారి పిలుస్తున్నట్లు కబురు వచ్చినప్పుడు కూడ అదే రకమైన భయం, ఏమి జరగబోతుందన్న ఆదుర్దా కలుగుతుంది. ఈ ప్రపంచంలో మనకు నిర్భయత్వాన్ని ఎవరు అందిస్తారు? 'అభయం సర్వభూతేషు' - నిర్భయత్వాన్ని గురువు, అదే దేవుడు మాత్రమే ప్రసాదించగలడు.

## మూల కారణం

అసలు ఈ భయానికి మూలకారణమేమిటి? ఎందుకు భయపడతారు? దీన్ని గురించి ఆలోచిస్తే, అది కోరికల వల్ల ఏర్పడుతుంది. నేను అనుకొన్నట్లుగా జరగక పోతుందేమో అన్నదే భయానికి కారణం. ఒక అనిశ్చితి ఏర్పడిన క్షణంలో భయం మొదలౌతుంది. మన కోరిక నిష్ఫలమౌతుందన్న ఆలోచన వచ్చినప్పుడు దుఃఖం ఏర్పడుతుంది. ఆ క్షణమే భయం కలుగుతుంది. అప్పుడప్పుడు మనంతట మనం, ఇక భయపడము, పై అధికారి అంటే భయపడము, ఏముంది భయపడడానికి? అనుకొంటూ వుంటాము. అది మంచి ప్రవచనం విన్నప్పుడు జరుగుతుంది. అది మనం సంతోషంగా వున్న సమయాల్లో జరుగుతుంది. ఇది మనస్సుకు సంబంధించినది. కాని ఏదైనా క్లిష్ట పరిస్థితి ఎదురైనప్పుడు మళ్ళీ చింత మొదలౌతుంది. అంతకు ముందు అనుకొన్నట్లు జరగదు. ఎందుకంటె మనసు చాలా లలితమైనది. అది ఎలా పనిచేస్తుందో మనకు తెలీదు.

నేను ఎవరికీ భయపడను అని నిశ్చయించుకున్న కొద్దిసేపటికే తిరిగి భయం మొదలు కావచ్చు. అందుకు ముందు నిశ్చయించు కున్నది ఏమైనట్లు? మానసికంగా ఎన్నో విషయాల గురించి అలా నిశ్చయించుకొనడం జరగవచ్చు. మనకు తెలియకనే, 'నేను ఇక మీదట భయపడను' అన్నది కూడ ఒక కోరికే! ఆ విషయం యొక్క అవగాహన లేకుండ ఎన్నో విషయాలలో అలాంటి నిశ్చయాలను

తీసుకుంటూ వుంటాము. అలా అనుకోవడం కూడ ఒక కోరిక అన్నది తెలియని కారణంగా భయం మాయం కాదు. అందుకే అన్ని కోరికలు నశించినప్పుడే అన్ని రకాల భయాలు నశిస్తాయి. సాధారణ విషయాలకు విరుగుడుగా ఇది చేయాలి, లేదా మరొకటి చేయాలి అని చెబుతుంటారు. ఉదాహరణకు, కోపం వచ్చినప్పుడు ఒకటి నుండి పదివరకు లెక్కపెట్టమంటారు. కోపాన్ని అణచడానికి ఇది ఒక చాలా సులభమైన మార్గమని అనిపిస్తుంది. పదివరకు లెక్కించగలిగితే కోపం తగ్గుతుంది. కాని నిజంగా కోపం వచ్చినప్పుడు లెక్కపెట్టడం జరగదు. అసలు కోపమంటే ఏమిటి? అది తాత్కాలికమైన పిచ్చితనం. నీ మీద నీకు అదుపు వుండదు. ఒకటి నుంచి పది లెక్కపెట్టే క్షణంలోనే కోపం మాయమవుతుంది.

## విశ్లేషణ నిరుపయోగం

నిజంగా కోపం వున్నప్పుడు, ఆ లెక్క మొదలుపెట్టిన వెంటనే కోపం తగ్గడంతో, తిరిగి కోపం వెంటనే వచ్చే అవకాశాలు తక్కువ. ఆ తరువాత ఏ గంట దాటినప్పుడో, తిరిగి కోపం వస్తే రావచ్చు. నేను కోపంగా వున్నానన్న స్పృహ వచ్చినప్పుడే, కోపం పోతుంది. అదుపు వచ్చినందున కోపం వుండదు. కోపగించుకొనడం ముగిసిన తరువాత, కోపం మహా చెడ్డది, రేపటి నుండి కోపం తెచ్చుకోకూడదు అని మనమే అనుకుంటాము. కాని మళ్ళీ కోపం వస్తుంది. కోపం గురించి విశ్లేషణ చేసినంత మాత్రాన కోపం మానుకొనేందుకు అది సహాయకారి కాదు.

కోపం ఆశల మీద ఆధారపడి వుంది. భగవాన్ బోధనలను పరిశీలించి చూచినప్పుడు ఈ విషయం తెలుస్తుంది. అన్ని కోరికలను లేకుండ చేయగలనని అనుకొంటే, ఆ క్షణమే మనసు లలితంగా, యుక్తితో పనిచేస్తుంది. నేను సంతోషంగా ఏమీ కోరను అని నిశ్చయించుకున్నప్పటికీ మనసు అడ్డుపడుదుంది. దానిని తోసిపుచ్చలేము. మనసు ఎప్పుడూ కోరికలకు హత్తుకుని వుంటుంది. కోరికలు లేకుండ చేయడమన్నది మరొక కోరిక. ఈ చిక్కునుండి మన స్వంత తర్కజ్ఞానంతో బయటపడి, మనసును కల్పించుకోకుండ చేసే మార్గం లేదు, కోర్కెలు మాయమయ్యే లాగ చేయలేము కూడ. అందుకే కోట్లాది కోరికలుంటాయి. దీన్ని వదలిపెడతాను, దాన్ని వదిలిపెడతాను అన్న ఆలోచన పెట్టుకోవద్దని భగవాన్ అంటారు. కాని లలితంగా పనిచేసే మనసు మనల్ని అలా చేయనివ్వదు. మనకు ఒక మంచి కోరిక వుండవచ్చు. కాని అదీ కోరికే. మనసును మనము అనుకొన్న విధంగా పనిచేసేలాగ చేయడం గాని బుద్ధికి సంబంధించిన దృక్కోణం నుండి పరిష్కారం వెదకడం గాని కుదరదు. మనకు వున్న ఒకటే మార్గం "ఈ కోరికలను ఎవరు కోరుతున్నారు?", "కోపపడుతున్నది ఎవరు?" అని మనల్ని మనమే పరిశీలించుకొనడం. ఇది ఒక్కటే తగిన ఉపాయమనీ, తక్కినవి అన్నీ తాత్కాలికంగా తృప్తిని కలిగించేవి మాత్రమేనని రమణ మహర్షి అంటారు.

## ఏకైక మార్గం నిశ్చలంగా వుండడం

ఒక చెట్టు కొమ్మలను కొట్టేస్తే, అది మళ్ళీ పెరుగుతుంది.

కాని దాన్ని వేళ్ళతో పెకిలిస్తే, ఎలాంటి పెరుగుదల కనిపించదు. అలాగే మిగతా అన్ని పద్ధతులు ఒక స్థాయి వరకు ఉపయోగ కరంగా వుంటాయి. అమితమైన జాగ్రత్త వహిస్తే తప్ప, గురువు యొక్క కృప వుంటే సరి లేకుంటే మనం పురోగతి చెందుతున్నామన్న తప్పుడు అభిప్రాయానికి వస్తాము.

మన ఆధ్యాత్మిక ప్రగతిని అంచనా వేయడం మనసుకు చేత కాదు. ఎందుకంటే, తనకు మించిన స్థాయిలో వున్న దానిని మనసు బేరీజు వేయలేదు. అందుకే మన ఆధ్యాత్మిక ప్రగతిని మనం అంచనా వేయడం కుదరదు. మనసు రంగంలోనికి లేని స్థితి వున్నప్పుడే, అది సాధ్యమౌతుంది. భగవాన్ అన్నట్లు "మనసు తొలగిపోవడానికి ఇష్టపడదు. అది ఎల్లప్పుడూ మనల్ని అంటి పెట్టుకుని చురుకుగా వుండడానికి విశ్వప్రయత్నం చేస్తుంది. అది తనలోనే లీనమైపోవడానికి మార్గం మనం నిశ్చలంగా వుండడం ఒక్కటే. అందరూ కోరుకునే నిర్భయత్వం, మిగతా అన్ని ప్రయత్నాలు కొంతవరకే విజయవంతమౌతాయి". నిశ్చలంగా వున్నప్పుడు నిర్భయ స్థితి ఏర్పడుతుంది. నిర్భయత్వం చోటు చేసుకున్నప్పుడు ఆశలన్నవి అడుగంటుతాయి. ఏ రకమైన కోరికలు లేనప్పుడు ఒక పరమానంద స్థితికి చేరతాము. మనసే లేని ఆ స్థితిలో అహం లేని స్థితిలో, ద్వంద్వ భావన లేనప్పుడు సచ్చిదానందాన్ని అనుభవించగలం. అప్పుడు నేను, నాది అన్నవి అదృశ్య మౌతాయి, ఎలాంటి భయమూ కోరికా వుండవు. అందుకు భగవాన్ కృప అవసరం.

# శ్రీ భగవాన్ సేవలో

- జి. శ్రీహరిరావు

## 15. చెట్టినాడు

శ్రీ భగవాన్ దివ్యచరిత్రలోని ప్రతి అంశంవలె, వారికి నాపై వున్న ప్రేమ వర్ణనాతీతం. నామీద అనేక రకాలుగా వారి కరుణను కురిపించారు. వారి అనుగ్రహం లేకుండా నేను దాదాపు 40 సంవత్సరాలు ఆశ్రమ నిర్వహణ చేయగలిగేవాడినా? 1938లో నేను కుటుంబసహితంగా తిరువణ్ణామలై వచ్చి, సర్వాధికారి అయిన నా తండ్రిగారు అప్పగించిన ఆశ్రమ బాధ్యతలు నిర్వహించడం మొదలు పెట్టకముందు కాలంలో కూడా ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ శ్రీభగవాన్ నాకు ఆధ్యాత్మిక పుష్టి కలిగిస్తూనే వున్నారు.

నేను 1932 నుండి 1937 వరకు చెట్టినాడు బ్యాంకులో పనిచేసేవాడిని. లెక్కలు వ్రాయడంలో నా నేర్పరితనం గుర్తింపబడి నాకు చాలా పేరు తెచ్చింది. ఆశ్రమం నుండి తమిళ దినపత్రిక 'స్వదేశ మిత్రన్'లోని కత్తిరించిన భాగాలు నా బ్యాంకు చిరునామాకు క్రమం తప్పకుండా వచ్చేవి. వీటి విశేషమేమిటి?

వైయ్యయి సుబ్రహ్మణియన్ అనేవారు 'అంతా ఒక్కటే' అనే చిన్న పుస్తకం అద్వైతపరమైంది వ్రాసారు. ఈ తమిళ పుస్తకాన్ని శ్రీ భగవాన్ చదివి, ప్రతి అధ్యాయానికీ శీర్షికను ఇచ్చి, "మోక్షం కావాలంటే ఈ పుస్తకాన్ని చదవాలి" అని ఒక భక్తునికి సెలవిచ్చారు. ఈ పుస్తకంలోని భాగాలు స్వదేశ మిత్రన్‌లో ప్రచురితమయ్యేవి. ఆ వ్యాసాలను శ్రీభగవాన్ స్వయంగా కత్తిరించి, నాకు పంపమని ఆశ్రమాధికారులను ఆదేశించేవారు.

నా చిన్న వయస్సులో నాకు కాంగ్రెస్ పార్టీ అంటే అభిమానం వుండేది. 1927లో నేను మన్నార్‌గుడిలో వుండేవాడిని. గాంధీజీ అక్కడ ఉపన్యాసాలు ఇచ్చేవారు. అప్పటినుండి నేనుఖాదీయే ధరించేవాడిని. నేను పని చేయడం మొదలు పెట్టిన చెట్టినాడు బ్యాంకులో పనిచేసే శ్రీనివాసన్‌గారు కూడా కాంగ్రెస్‌వాదియే. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభలకు నన్ను కూడా తీసుకు వెళ్ళేవారు. అలా, అనేకమంది కాంగ్రెస్ నేతలను కలుసుకునే అవకాశం నాకు లభించింది.

## 16. నా ఆశ్రమ జీవితం ప్రారంభం

ఆశ్రమంలో పుస్తకాలనూ, ఆఫీసునూ 1937 మే 11వ తారీఖున శ్రీభగవాన్ ప్రారంభించారు. అదేరోజు ఉదయం, నా తండ్రిగారు - అందరిచేత చిన్నస్వామి అని పిలవబడే సర్వాధికారి - ఆశ్రమంలో నిర్మాణ కార్యక్రమాలకోసం రంగూన్ నుంచి టేకు చెక్కలు (దుంగలు) చవకగా ఖరీదు చేసి తీసుకొచ్చారు. డబ్బు సంగతులు చూసుకోవడానికి, లెక్కలు వ్రాయడానికీ, ఆఫీసు పనులు నిర్వహించడానికీ నమ్మకస్తుడైన వ్యక్తి అవసరమని ఆశ్రమంలో చాలామంది భావించారు. ఈ సందర్భంలో, శ్రీభగవాన్ మహాభక్తులైన యోగిరామయ్యగారు, సాంబశివరావుగారు బ్యాంకు ఉద్యోగం వదిలివేసి ఆశ్రమానికి వచ్చేయమని నాకు జాబు వ్రాసారు.

ఇదే కాలంలో బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో వున్న భారతదేశం నుండి బర్మా విడిపోయి స్వతంత్ర దేశం అయ్యింది. దీనికి పర్యవసానంగా చెట్టినాడు బ్యాంకు మూసివేసారు. దక్షిణ భారత కార్పోరేషన్ బ్యాంకు అనే కొత్త బ్యాంకును అదే సమయానికి తెరిచారు. దానిలో చేరమని నాకు ఉద్యోగావకాశం కూడా కల్పించారు.

నేను గృహస్థుణ్ణి, భార్య, ఇద్దరు పిల్లలు, అలమేలు అత్త, మామ పిచ్చు అయ్యర్ వీరందరినీ పోషించే బాధ్యత నాపై వుంది. నా తండ్రి, ఆశ్రమ సర్వాధికారి, క్రమశిక్షణను గట్టిగా పాటించే వ్యక్తి. మా కుటుంబం ఆశ్రమంలో వుండటానికి ఒప్పుకోరు. అందువలన శ్రీభగవాన్ అనుమతి లేకుండా ఆశ్రమ బాధ్యతలు స్వీకరించడం నా పట్ల సరికాదని తలంచి, నేను ఆశ్రమంలో వుండటం గురించి శ్రీభగవాన్ అభిప్రాయం కనుక్కోవడానికి మా కుటుంబ స్నేహితులు చెల్లియ్య అనబడే శ్రీ వి.నారాయణస్వామిగారిని ఆశ్రమానికి పంపించాను. చెల్లియ్యగారు యోగిరామయ్యగారిని సంప్రదించి ఒకరోజు శ్రీభగవాన్ కొండ మొదలులో ఒంటరిగా వున్నపుడు ఈ విషయాన్ని ప్రస్తావించారు. శ్రీభగవాన్ వెంటనే ఇలా అన్నారు. "వెంకిటూ గృహస్థు. అయితే ఏమిటి? ఇంటి అవసరాల గురించి ఆశ్రమం చూసుకోవచ్చు". దానితో నా సందేహాలు తీరిపోయాయి. ఆశ్రమసేవకు నాకు శ్రీభగవాన్ దీవెనలు అందాయని భావించాను.

కొత్త బ్యాంకు నుండి రెండు నెలలు సెలవు తీసుకొని, కుటుంబంతో సహా, ఫిబ్రవరి 1938లో ఆశ్రమానికి వచ్చేసాను. యోగిరామయ్యగారు, సాంబశివరావుగారు కలిసి ఊళ్ళో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. నేను కుటుంబంతో సహా అక్కడ స్థిరపడ్డాను. కొత్త ప్రదేశంలో జీవనం సాగించడానికి కావలసిన బట్టలు, డబ్బు నాకు సమకూర్చారు. ఉదయమే ఆశ్రమానికి వెళ్ళి, చీకటిపడే సమయానికి తిరిగి ఇంటికి వచ్చేవాడిని. నా ఇద్దరు కొడుకులు చిన్నవాళ్ళు. వారు సాయంత్రం ఎద్దుబండిలో ఆశ్రమానికి వచ్చి, నాతోపాటు తిరిగి ఇంటికి వచ్చేవారు.

## 17. ఇబ్బంది కారకుడు

నా చిన్నపుడు మా అత్తా మావయ్యలతో స్కందాశ్రమానికి వెళు తున్నపుడు శ్రీభగవాన్ భక్తుడు పెరుమాళ్‌స్వామి నన్ను చెట్టుకొమ్మలకు కట్టిన ఉయ్యాలలో ఊపి ఆడిస్తూ వుండేవాడు అని ఇంతకుముందు చెప్పి వున్నాను. కాలక్రమాన, ఆయన ఒక తిరుగుబాటుదారుగా, ఒక శత్రువుగా తయారయ్యాడు. 1922లో శ్రీభగవాన్ తల్లిగారు తనువు చాలించినపుడు పాలితీర్థం తూర్పు గట్టున ఆమెకు సమాధి కట్టబడింది. ఆ పవిత్ర స్థలం వద్ద నిరంజనానందస్వామిగానీ, రామనాథ బ్రహ్మచారి గానీ పూజలు చేసినపుడు అతను గొణుగుతుండేవాడు. అక్కడ పూజ చేసే అర్హత బ్రాహ్మణులకు లేదు అనీ, పూజ చేయవలసింది తాను అనీ ఇతర భక్తుల దగ్గర వాదించేవాడు. తన కార్యసాధనకోసం భక్తులలో విబేధాలు కల్పించడానికి, బ్రాహ్మణులు సాధువులు కారనీ, సాధువులు బ్రాహ్మణులు కానక్కర్లేదనీ మాట్లాడేవాడు. ఈ విధంగా స్కందాశ్రమ ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేయడం ప్రారంభించాడు.

1922 చివరలో శ్రీభగవాన్ అరుణాచల పర్వతం మొదలులో పాలితీర్థం గట్టుమీద వున్న తన తల్లిగారి సమాధి వద్దకు శాశ్వతంగా వుండటానికి మకాం మార్చారు. పెరుమాళ్‌స్వామి గొడవ, కొండమీద కంటే కొండక్రింద ఇంకా ఎక్కువైంది. అయితే, భక్తులు ఆయనను తీవ్రంగా ప్రతిఘటించడం వలన ఆశ్రమం వదలి తన మకాం ఊళ్ళోని దుర్గాంబ గుడికి చెందిన పూలతోటలో ఒక గుడిసెకు మార్చాడు. పంచ లోహాలతో చేసిన శ్రీభగవాన్ చిన్న విగ్రహాన్ని ఒకటి పెట్టుకొని, నిజమైన రమణాశ్రమం తన గుడిసె అని ఊళ్ళో ప్రచారం చేయడం ప్రారంభించాడు. అంతేకాదు. పోస్టాఫీసుకు వెళ్ళి, శ్రీరమణాశ్రమ

కార్యనిర్వాహకుని పేర వచ్చే ఉత్తరాలనూ, మనీ ఆర్డర్లనూ తీసుకోవడం ప్రారంభించాడు. ఆయన ఆకతాయే గాక, మహా తెలివైనవాడు. తన మిత్రులకు శ్రీరమణాశ్రమం, తిరువణ్ణామలై అని జాబులు పంపమని చెప్పేవాడు. ఆశ్రమ భక్తులు పోస్టాఫీసుకు వెళ్ళి ఆ ఉత్తరాలు తీసుకు వెళ్ళినపుడు ఆశ్రమం మీద విచారణ జరపాలని తన మిత్రులతో ఫిర్యాదులు చేయించేవాడు. ఈ విధంగా అనేక రకాలుగా ఆశ్రమానికి ఇబ్బందులు కల్పించాడు పెరుమాళ్‌స్వామి.

ఈ విషయాలు శ్రీభగవాన్ దృష్టికి తెచ్చినపుడు, "పోస్టాఫీసుకు వచ్చిన టపా అంతా పెరుమాళ్‌స్వామికి ఇవ్వరాదా? తన వస్తువులు తాను వుంచుకోగా, మిగిలినవి ఆశ్రమానికి తేవచ్చును కదా!" అన్నారు భగవాన్. తపాలాశాఖకు సంబంధిత విషయాల్లో, పెరుమాళ్‌స్వామి కల్పిస్తున్న ఈ ఇబ్బందుల వలన ఒక లాభం జరిగింది. ఇండియన్ సివిల్ సర్వీసెస్‌కు చెందిన శ్రీపన్నాలాల్‌గారు ఒకసారి ఆశ్రమానికి వచ్చారు. ఆ సమయంలో ఆయన ఉత్తర భారతంలో యునైటెడ్ ప్రావిన్సెస్ (ప్రస్తుత ఉత్తరప్రదేశ్)కు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా వుండేవారు. ఈ ఇబ్బందులు వారి దృష్టికి తీసుకువెళ్ళినపుడు, ఆయనకు చాలా కోపం వచ్చింది. "ఎవరీ పెరుమాళ్‌స్వామి? శ్రీరమణ మహర్షి ఎక్కడుంటే అదే రమణాశ్రమం" అన్నారు. తన తిరుగు ప్రయాణంలో, మద్రాసు పోస్టుమాస్టర్ జనరల్‌గా వున్న శ్రీమిశ్రాగారితో ఈ విషయం చర్చించి, 1937లో శ్రీరమణాశ్రమానికి ప్రత్యేకంగా ఒక పోస్టాఫీసు ఏర్పడటానికి దోహదం చేసారు.

కానీ, ఈ పెరుమాళ్‌స్వామి అక్కడితో ఆగలేదు. ఇంకొక మార్గం నుండి దాడి మొదలుపెట్టాడు. ఆశ్రమం నెలకొన్న స్థలం ప్రభుత్వ

స్థలం కాదనీ, ఎవరికో చెందిన సొంత స్థలం అనీ, ఆశ్రమవాసులకే తెలియదు. ఈ ఆశ్రమ 'శత్రువు' తన పరిశోధనల ద్వారా, ఆ స్థలం కాంచీపురానికి చెందిన బావాజీ మఠానికి చెందినదని కనిపెట్టాడు. ఆ సొంతదారులను కలుసుకొని, ఆ స్థలాన్ని ఏడు సంవత్సరాలు గుత్తకు తీసుకొని తన పేర రిజిష్టరు చేయించుకున్నాడు. శ్రీభగవాన్‌తో సహా ఆశ్రమవాసులంతా ఆశ్రమాన్ని ఖాళీ చేయాలని కోర్టులో కేసు వేసాడు. ఈ కేసు మద్రాసు హైకోర్టులో 1945 దాకా నడిచింది. చివరకు న్యాయ నిర్ణయం ఆశ్రమానికి అనుకూలంగా వచ్చింది.

పెరుమాళ్‌స్వామి ఊరికే కూర్చునే మనిషి కాడు. శ్రీనిరంజనానంద స్వామిని సర్వాధికారిగా నియమిస్తూ శ్రీభగవాన్ 1933లో వ్రాసి రిజిష్టర్ చేయించబడిన వకాల్తానామాను సవాలు చేస్తూ తిరువణ్ణామలై మున్సిఫ్ కోర్టులో 1936లో కేసు వేసాడు. "సర్వం పరిత్యజించిన శ్రీరమణ మహర్షికి ఆస్తిహక్కులు లేవనీ, కావున దానిని ఇతరులకు వ్రాసిచ్చే అర్హత వారికి లేద"నీ పెరుమాళ్‌స్వామి వాదన. ఈ కేసు విషయంలో, శ్రీభగవాన్ తానే కోర్టుకు వచ్చి సాక్షిబోనులో నిలబడి తన వాంగ్మూలం ఇవ్వాలని పట్టుబట్టాడు. ఈ వాదనను మున్సిఫ్ కోర్టు ఆమోదించింది. భక్తులందరూ ఈ నిర్ణయం విని చాలా ఆందోళన చెందారు. ఆంగ్ల జాతీయుడైన శ్రీగ్రాంట్ డఫ్‌గారి కృషి వలన మద్రాసు రాష్ట్ర గవర్నర్ లార్డ్ ఎర్స్కిన్, శ్రీభగవాన్ వాంగ్మూలాన్ని సేకరించడానికి ఒక కమీషనర్‌ను నియమించాలనీ, ఆ వాంగ్మూలం ఆశ్రమంలోనే సేకరించాలని ఆదేశించారు.

శ్రీభగవాన్‌ను కమీషన్‌వారు ఆశ్రమంలోనే ప్రశ్నించారు. తాను ఏ ఆశ్రమానికి చెందుతారని ప్రశ్నించబడినపుడు "అతి ఆశ్రమానికి"

అని సమాధానమిచ్చారు శ్రీభగవాన్. (నాలుగు ఆశ్రమాలకు అతీతుడను అని భావం). అతి ఆశ్రమికి ఆస్తులుండవచ్చా అని ప్రశ్నించబడినపుడు, ''అలాంటి నిబంధన ఏమీ లేద''ని శ్రీభగవాన్ జవాబిచ్చారు. ''వారికి ఆస్తులుండవచ్చు, వుండకపోవచ్చు, ఇతరులకు ఇవ్వవచ్చు. ఇదంతా వారి ప్రారబ్ధానుసారం జరుగుతుంద''ని వివరించారు. కమీషన్‌వారు ఇచ్చిన నివేదిక ప్రకారం 1937లో న్యాయనిర్ణయం ఆశ్రమానికి అనుకూలంగా ఇవ్వబడింది.

1945 చివరలో పెరుమాళ్‌స్వామి తీవ్రంగా జబ్బుపడ్డారు. దుర్గాంబ గుడినుండి వెళ్ళగొట్టబడ్డారు. వ్యాధిగ్రస్థుడై, నిలువ నీడలేక వున్న ఆయనకు చివరకు రమణాశ్రమం పక్కనే వున్న శేషాద్రిస్వామి ఆశ్రమ ప్రాంగణంలో ఆశ్రయం దొరికింది. దయనీయమైన ఆయన స్థితి గురించి శ్రీభగవాన్‌కు తెలియపరచి, సర్వాధికారికి తెలియకుండా, ఆయనకు భోజనం, మందులూ పంపేవాడిని. పెరుమాళ్‌స్వామి ఆరోగ్యం కొంతవరకు మెరుగైంది. ఆ సమయంలో ఒకసారి శ్రీ భగవాన్ నాతో ఇలా అన్నారు, ''పాపం పెరుమాళ్‌స్వామి! ఇపుడు ఆశ్రమాన్ని కోర్టు కేసులతో వేధిస్తున్నాడుగానీ, మనం ఆయన గతంలో చేసిన మంచి పనులు మరచిపోకూడదు. ఒకసారి స్కందాశ్రమంలో నాకు తీవ్రంగా విరేచనాలైనపుడు, నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకొన్నది ఆయనే.'' శ్రీభగవాన్ ఎల్లలు లేని ఉదారత చూసి నేను నిశ్చేష్టుడి నయ్యాను. పెరుమాళ్‌స్వామి ఆరోగ్యం క్రమంగా క్షీణించి, 1950 ఏప్రిల్ నెలాఖరున తనువు చాలించాడు. *(సశేషం)*

## అనుస్మరణీయులు

# శ్రీమతి వి. త్రిపుర సుందరి

- విడపనకంటి ప్రదీప్‌చంద్ర

### కుటుంబ నేపథ్యం

అమ్మ నెల్లూరిలోని చివుకులవారింట్లో జన్మించింది. ఆమె మాతామహుల వారిది ఓరుగంటి కుటుంబం. రెండు కుటుంబాల లోనూ దేశభక్తి, జాతీయతాభావం చాలా ఎక్కువ. అదే అమ్మకూ ఒంటబట్టింది. ఓరుగంటి కుటుంబం మొత్తం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్నవాళ్ళే. వాళ్ళ తాత శ్రీ ఓరుగంటి వెంకటసుబ్బయ్యగారు సహాయనిరాకరణ, మద్యపాన నిషేధం మొదలైన కార్యక్రమాలల్లో చురుకుగా పాల్గొని జైలుకు వెళ్ళారు. అమ్మ మేనమామలు నలుగురిలో ఆఖరి వారు డా. ఓరుగంటి రామచంద్రయ్య గారు. రెండవ వారు శ్రీ ఓరుగంటి వెంకట కృష్ణయ్య గారు. ఇద్దరూ ఆధ్యాత్మిక భావాలు గలవారు. శ్రీరమణ మహర్షి యొక్క గాఢమైన భక్తులు. రామచంద్రయ్య గారు కూడ జాతీయోద్యమంలో పాల్గొన్నవారే. ఏదో ఒక కేసులో అకారణంగా చేర్చబడి జైలు శిక్షను అనుభవించాల్సి వచ్చింది.

డా. రామచంద్రయ్యగారు ఇంగ్లండ్‌లో పి.హెచ్.డి. పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోచరిత్ర, పురాతత్వ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. శ్రీ వెంకటకృష్ణయ్య గారు (కృష్ణభిక్షు) కొంత కాలం ప్రభుత్వ ఉద్యోగం చేశారు. బ్రహ్మచారి. శ్రీరమణా

్రశమంలో అంతేవాసి. డా. రామచంద్రయ్య ‘‘శ్రీరమణ భాషణములు’’ అన్న అనువాద గ్రంథాన్ని రచించారు. సంగీత జ్ఞానమున్న ఆయన ‘‘మీరా పాటలు’’ పేరుతో తెలుగులో మీరాబాయి పాటలను కర్ణాటక బాణీలలో రచించారు. శ్రీకృష్ణభిక్షు ‘‘శ్రీరమణలీల’’ అన్న గ్రంథాన్ని రచించారు.

డా. రామచంద్రయ్యగారి వివాహం శ్రీ మునగాల వెంకట రామయ్య (తరువాత శ్రీరమణానంద సరస్వతి) గారి కుమార్తె శ్రీమతి కామాక్షమ్మ గారితో జరిగింది. ఆసక్తికరమైన విషయమేమి టంటే వివాహం నిశ్చయం కాని రోజుల్లోనే కామాక్షమ్మను తెలుగు నేర్చుకోమని మహర్షి చెప్పారట! రామచంద్రయ్యగారిని ‘రమణాశ్రమం అల్లుడు’ అని అనేవారు. పదవీవిరమణ చేసిన తరువాత ఆయన ఆశ్రమం ఎదురుగా వుండే రమణనగర్‌లో స్వంత గృహం ఏర్పరచుకుని అక్కడే స్థిరపడ్డారు. భార్యాభర్తలిద్దరూ కాలాంతరంలో తిరువణ్ణామలైలోనే దేహం చాలించారు.

## తొలిరోజులు

స్కూలు చదువు తరువాత, అమ్మ మేనమామల దగ్గర వుండి డిగ్రీ చేసింది. కొంతకాలం తరువాత మా నాన్న డా. రామదాస్‌మూర్తి గారి ప్రోత్సాహంతో టీచర్ ట్రెయినింగ్ (బి.ఇడి) పూర్తి చేసింది. రెండు బాలికా ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితులుగా పనిచేసింది. పాఠాలను బోధించడంతో బాటు విద్యార్థినులలో దేశభక్తి, సామాజిక స్పృహలను రేకెత్తించే పద్యాలు, పాటలు,

స్వయంగా రచించి పాఠశాల ఉత్సవాలలో వారితో నటింప జేసేది, తాను కూడా పాల్గొనేది. నాకు శాస్త్రీయ సంగీతంలో అభిరుచి పెరగడానికి అమ్మే కారణం. అదే స్ఫూర్తి తరువాతి రోజుల్లో మహర్షిని గురించిన పాటలను నేను కర్ణాటక బాణీలో రచించి, స్వరపరిచి, పాడడానికి దోహదపడింది.

పై యిద్దరి మేనమామల ప్రభావం అమ్మ మీద బాగా పడింది. హైదరాబాదులో శ్రీరమణకేంద్రాన్ని డా. కె. సుబ్రహ్మణియన్ (డా.కె.ఎస్) గారు ప్రారంభిస్తున్నారన్న వార్త తెలుసుకుంది. శ్రీరాజేశ్వర రావుగారు (శ్రీశ్రీహరిరావుగారి తండ్రి) శ్రీ ఎ.వి. రమణయ్య గారి పరిచయంతో అమ్మ శ్రీరమణ కేంద్రం యొక్క సత్సంగాలు, కార్యక్రమాలలో తప్పకుండ పాల్గొనేది. సంగీతంలో ప్రత్యేక శిక్షణ పొందక పోయినప్పటికీ, అమ్మ చక్కగా పాడగలిగేది. రమణకేంద్ర సత్సంగ సమయాలలో తప్పకుండ రమణ భక్తి పాటలను పాడేది. ఆర్ద్రతో, రక్తిని, భక్తిని పాటలలో జోడించేది. మధ్యలోనే ఆవేశం తట్టుకోలేక అప్పుడప్పుడు ఆపి, పూర్తిచేయలేక పోయేది కూడ. ఏ మాత్రం వీలైనప్పటికీ, (కనీసం ఏడాదికి ఒకసారి) మేము శ్రీరమణాశ్రమానికి వెళ్ళేవాళ్ళం. అమ్మ కుటుంబ బాధ్యతలు, ఉద్యోగధర్మ పరిమితుల కారణంగా తిరువణ్ణామలై వెళ్ళలేకపోవడాన్ని గురించి చాలా బాధపడేది.

**డా. కె.ఎస్.గారి పట్ల గౌరవభావం**

డా. కె.ఎస్. గారంటే అమ్మకు అమితమైన పూజ్యభావం.

ఇంగ్లీషు అంతగా తెలియనివారికి కూడ సులభంగా అర్థమయ్యే విధంగా ఆయన చేస్తూ వుండిన ప్రసంగాలను అమ్మ ఎప్పుడూ మెచ్చుకుంటూ వుండేది. డా.కె.ఎస్. గారి షష్ఠిపూర్తి సందర్భంలోనూ, తరువాత కూడ వారిని గురించిన గేయాలను రచించేది. మా ఇంట్లో వివాహశుభకార్యాలను గురించి ముందుగా డా.కె.ఎస్. గారిని సంప్రదించడం అమ్మకు పరిపాటి. మొట్టమొదటి శుభలేఖను వారికి సమర్పించి, ఆశీర్వాదాన్ని తీసుకొనడం తప్పనిసరిగా జరిగేది. డా.కె.ఎస్. తీవ్ర అనారోగ్యానికి గురై ఇంట్లోనే వుంటున్న రోజుల్లో నా తల్లిదండ్రులు వారి గృహానికి వెళ్ళి వచ్చేవారు. కాని ఆ తరువాత డా. కె.ఎస్. గారి నిర్యాణం జరిగినప్పుడు, పార్థివ దేహాన్ని దర్శించుకునే అవకాశం తనకు రాలేదని అమ్మ చాలా రోజులు బాధపడింది.

కుటుంబ బాధ్యతలు కొంతవరకు తగ్గాయనుకున్న సమయంలో అమ్మ స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసింది. శ్రీరమణ కేంద్రంలోని సత్సంగాలలో యథావిధిగా పాల్గొంటుండేది. కుటుంబ సభ్యులందరిలోనూ రమణభక్తి బీజాలను నాటడంలో అమ్మ కృతకృత్యురాలు అయ్యింది. కాలక్రమేణా ఆరోగ్యం దెబ్బతినడంతో చురుకుగా కేంద్ర కార్యక్రమాలలో పాలుపంచు కొనడానికి అమ్మకు వీలు కాలేదు. అనారోగ్యం తీవ్రమై 2006 సం॥ ఏప్రిల్ 16న శరీరం చాలించింది.

•

# శ్రీరమణ మానసము

- శ్రీమతి బిరుదవోలు లక్ష్మమ్మ

సీ॥ తెల్లని గోచిని తీరుగా ధరియించి
యొకతుండు భుజముపై నొసగ వైచి ।
భస్మంబు నుదుటిపై బాగు మీరగ బూసి
కుంకుమ బొట్టును కొమర బెట్టి ।
కరమున దండంబు కడువింతగా బట్టి
మోమున చిరునవ్వు ముద్దుగుల్క ।
మాధుర్య మొలికించు మాటల బల్కుచు
కారుణ్య మయములై కన్ను లమర ।

తే.గీ. బ్రహ్మ తేజ మెల్లయెడల ప్రభలు బరుప ।
భక్తవర్యులచే నిండి భద్రమైన ।
కొలువు కూటంబున గలడు కూర్మితోడ ।
రమణ భగవాను డాతడె రారె చూడ ॥

సీ॥ అను దినంబును గల్గ నాయన రక్షాప్తి
వరముల గోరెడు వాంఛ యేల ।
ఉల్లంబు నందునే నున్నాడ నని యుండ
కనజాల నను చింత కనగ నేల ।
అడగడ్డుగనకు వాని అభయంబు నొందుచు
భవభీతి వలని కలవర మేల ।
కర్త తానే యౌచు కార్యముల్ నడిపింప
నాకర్మ యంచును నలగ నేల ॥

తే.గీ. కరుణ నిండిన యానంద కలితుడైన ।
పరమ దైవంబు మనసున పాదు కొల్పి ।
అన్నిటిన్ వాని కర్పించి యధిక భక్తి ।
సేవ చేసిన భువిలోన చెలగు సుఖము ॥

**(కందపద్య మాలిక)**

1. అరుణాచల గురు రమణుడు
పరమానంద మయుడగుచు పరిపూర్ణుండై
కరసంజ్ఞల కనుసన్నల
శరణార్థుల నెపుడు బ్రోచు చయ్యన మనసా ॥

2. ఎందఱొ యోగులు జ్ఞానులు
ఎందఱొ గుణశీలు రెందరెందఱొ గొల్వన్
అందఱి గాదని నాపయి
నందునొ రమణేశు కరుణ? యందును మనసా॥

3. అరుదౌ ముల్లోకంబుల
దొఱకని యొకజ్ఞానిసేవ దొఱకె నదెట్లో
తరియించెను నీ జన్మము
సరి నీ కెవరైన గలరె జగతిని మనసా ॥

4. తడవక మృగముల జంపుచు
నడవుల దిరిగెడు కిరాతు డయ్యెన్ ఋషిగా
వడి సజ్జన సంగ మహిమ
పుడమిని కరుణాబ్ధి లమ్మ పూర్ణులు మనసా ॥

5. వినుమొక దాసీతనయుం
డనయము తా సాధుసేవ నందెను భక్తిన్
తనరె .. దేవర్షియునై
కనగదె సాధుత్వ ప్రభవ ఘనతల్ మనసా ॥

6. కన్నుల నిండుగ నెప్పుడు
చెన్నొ రమణేశు మూర్తి స్థిరతర భక్తిన్
గ్రన్నన నానందించుట
లెన్నడు గల్గెడినొ నాకు నెటులే మనసా ॥

7. పలు కరుణా వీక్షలచే
విలసిల్లెడి నా మనోబ్జ వీధుల యందున్
తొలగు నహంతా దైన్యము
కల గురుసన్నిధి సుఖంబు గాంతునె మనసా ॥

8. ఎన్నో విషయ సుఖంబులు
ఎన్నో ధనురాసు లవియు నెంత కలిగినన్
తిన్నగ గురుపద సన్నిధి
నున్నట్టి సుఖంబు సాటియుండునె మనసా ॥

9. ఇలపై భానుడు దోపన్
కలకల మేల్కొనెడి జగము కాంతులు పర్వన్
అలరీతి రమణు నుదయము,
కల చిత్తును జేర దెలిపి, గాచును మనసా ॥

(శ్రీమతి బిరుదవోలు లక్ష్మమ్మ గారిని గురించి శ్రీమతి గ్రిద్దలూరు జయలక్ష్మి వ్రాసిన సంక్షిప్త వ్యాసం శ్రీరమణజ్యోతి, సెప్టెంబర్, 2019 సంచికలో ప్రచురింపబడింది)

## శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ గుడిపాటి వెంకటచలం

మల్లాది ఫణిమాల

గుడిపాటి వెంకట చలం (1894-1979) ప్రసిద్ధ తెలుగు రచయిత మరియు తత్వవేత్త. 1894, మే 19వ తేదీన, చెన్నైలో శ్రీ సాంబశివరావు, శ్రీమతి వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. శ్రీ చలం తమ రచనల్లో ముఖ్యంగా స్త్రీలు సమాజంలో ఎదుర్కొనే కష్టాలను గురించి వ్రాశారు. స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీ గుడిపాటి వెంకటచలం 1950లో అరుణాచలంలో స్థిరపడ్డారు. వీరు రచించిన 'భగవాన్ స్మృతులు' అనే గ్రంథంలో శ్రీభగవాన్ భక్తుల స్మృతులను తెలియబరిచారు.

1930వ సంవత్సరంలో శ్రీభగవానులను మొట్టమొదటిసారిగా చూసినప్పుడు శ్రీచలం ఒక తీవ్రవాద సామాజిక ప్రచారకులు. అలా క్రమంగా కొన్ని సంవత్సరాలు గడిచాక, శ్రీ భగవానుల అనుగ్రహ వలలో చిక్కుకుని, వారియందు పరిపూర్ణ శరణాగతి నొందారు. కళాశాల రోజులలోనే భగవత్ ప్రార్థనలు, ధ్యానం చేయడం, భజనలు పాడడం వంటి అలవాటు ఉన్న చలంగారు సాధన ముమ్మరంగా చేపట్టి, భగవత్ సంబంధమైన ఇటువంటి కార్యక్రమాలలో ఎంతో కాలం గడిపేవారు. అయినప్పటికీ జీవితంలో శాంతిని చవిచూడలేకపోయారు. వ్యక్తిగత జీవితమంతా అస్తవ్యస్తంగా ఉందని గమనించిన శ్రీ చలంగారికి, దుఃఖమూ, దోషమూ, కష్టమూ ఉన్న ఈ ప్రపంచానికీ దయామయుడైన

భగవంతునికీ గల సంబంధమేమిటో అర్థం కాలేదు. ఇటువంటి పరిస్థితులలో, ఆయన అసలు దేవుడనే వాడు ఉన్నాడా అని సంశయించటం మొదలుపెట్టారు.

శ్రీచలం ఇలాంటి ఆలోచనలలో ఉండగా, వారి స్నేహితులైన శ్రీ చింతాదీక్షితులు ఆయనను శ్రీభగవానుల సందర్శనార్థం శ్రీరమణాశ్రమానికి తీసుకువెళ్ళారు. శ్రీరమణాశ్రమానికి వెళ్ళే దారిలో పండ్లు కొని తీసుకువెళదామని దీక్షితులు సూచించినప్పటికీ ఇటువంటి స్వాములయందు నమ్మకము లేని చలం దానికి అంగీకరించలేదు. శ్రీభగవానులను దర్శించినంతనే, వారికి సాష్టాంగ నమస్కారం చేయడానికి కూడ చలం మొదట నిరాకరించారు. దీక్షితులగారి వత్తిడి వల్ల సాష్టాంగ నమస్కారం చేశారు. భగవాన్‌ను దర్శించటానికి వచ్చిన వారంతా మౌనంగా కూర్చోవటాన్ని చలం ఎంత మాత్రమూ భరించలేకపోయారు. ఆశ్రమానికి చేరిన మరుక్షణం నుంచీ, వారిని అక్కడినుంచీ తీసుకు పొమ్మని దీక్షితులు గారిని వేధిస్తూనే ఉన్నారు. చలం, అక్కడ ఉన్న భక్తులను, వారి ప్రవర్తనను చూస్తున్నకొద్దీ, వారికి, రమణాశ్రమం అంటే అయిష్టత ఎక్కువైపోయింది. వారు దీక్షితుల్ని "శ్రీరమణ మహర్షి మనుషులలో మార్పు తేగలరు" అని అన్నావు. మరి ఎన్నో సంవత్సరాలుగా వారిని అంటిపెట్టుకుని ఉన్న వాళ్ళెంతో మంది ఇంకా ఇలాగే ఉన్నారెందుకు?" అని ప్రశ్నించారు.

రెండవరోజు మధ్యాహ్నం శ్రీభగవాన్ కొండదిగి రావటం చూశారు చలం. శ్రీభగవాన్ దగ్గరికి వస్తుండగా చలం తప్ప, మిగిలిన వాళ్ళందరూ ప్రక్కకు జరిగి, భగవాన్‌కు దారిని ఇచ్చారు. చలం

మాత్రం ఏ మాత్రం జరగకుండా అక్కడే నిలబడిపోయారు. శ్రీభగవాన్ వారిని సమీపిస్తుండగా, దీక్షితులు చలం గారిని ప్రక్కకు లాగారు. భగవాన్ వారిని దాటి వెళ్ళారు. అలా ముందుకు వెళుతున్న భగవాన్, అకస్మాత్తుగా ఆగి, వెనక్కి తిరిగి, చలం వైపు చూసి, ఒక చిరునవ్వు నవ్వి, తమ దారిన తాము వెళ్ళిపోయారు. ఈ సంఘటన జరిగినప్పుడు చలంగారికి ప్రత్యేకంగా ఏమీ అనిపించకపోయి నప్పటికీ, దానిని తర్వాత జ్ఞాపకం తెచ్చుకున్నప్పుడల్లా, వెనక్కి తిరిగి చిరునవ్వు నవ్విన క్షణంలో శ్రీ భగవానులు హృదయాన్ని దోచుకున్నారని చలంగారికి అనిపించింది.

ఏది ఏమైనప్పటికి ఆశ్రమ వాతావరణం కానీ, భగవాన్ యొక్క దయ, కారుణ్యము, వారుచేసే ప్రతీ పని, మాట్లాడే ప్రతీ మాటలో ఉన్న మాధుర్యాన్ని కానీ చలంను ఏ విధంగానూ ఆకట్టుకోలేక పోయినవి.

ఒకరోజు సాయంత్రం, చలం ఆశ్రమ వాతావరణం ఏ మాత్రమూ సహించలేక అలా బయట కాసేపు తిరిగి వద్దామని వెళ్ళి, తెలియకుండానే, అప్రయత్నంగా, అరుణాచలం కొండకి ప్రదక్షిణ చేసారు. ప్రదక్షిణ పూర్తి అయ్యాక, వారు ఆశ్రమానికి చేరుకున్నారు. ఆశ్రమంలో వేదపఠనం పూర్తి అయ్యాక, చలం అప్రయత్నంగా ఒక పాట పాడారు. 'ప్రాణ రమణ' అన్నది ఆ పాట పల్లవి. చలం నోటివెంట ఈ పాట విన్నవారందరూ ఎంతో మెచ్చు కున్నారు. శ్రీభగవానులు కూడా వారు ఈ పాట పాడుతున్నప్పుడు ఎంతో శ్రద్ధగా విన్నారని, ఎవరో చెప్పగా చలం తెలుసుకున్నారు. తిరిగి వెళ్ళవలసిన సమయమైనప్పుడు, శ్రీ భగవానుల వద్ద సెలవు

తీసుకుందామని, దీక్షితులు చలంగారిని తమతో పాటు భగవాన్ వద్దకు తీసుకువెళ్ళ గోరారు. దానికి చలం, "భగవాన్‌కు నాకు గల సంబంధమేమిటి? నేను తిరిగి మా ఊరు వెళ్తుంటే వారి వద్ద సెలవు తీసుకోవలసిన అవసరమేముంది? ఇటువంటి చాదస్తాలు నాకు నచ్చవు" అని తేల్చి చెప్పేసారు.

ఆశ్రమంలో అతిథిగా మూడు రోజులు గడిపినవారు తిరిగి వెళ్తున్నపుడు భగవాన్ వద్ద సెలవు తీసుకోవడం కనీస మర్యాదగా ఆ విధంగా చేయాలి" అన్న దీక్షితుల సూచన కాదనలేక వారి వెంట వెళ్ళిన చలం, భగవానులను సమీపించి, "నేను వెళ్తున్నాను" అని గొణిగారు. చలం మాటలు విన్న భగవాన్ చలం వైపు చూచి, చిరునవ్వు నవ్వారు. ఆ చిరునవ్వు అనుకోకుండా చలంలో ఊహించలేనంత మార్పు తెచ్చింది.

"నువ్వు వెళ్ళిపోతే, ఇక్కడ నేనెలా బ్రతకగలను? నేను ఎంతటి ఒంటరితనాన్ని అనుభవిస్తానో అని భగవాన్ వారితో అన్నట్లుగా అనిపించింది. అక్కడినుండి కదిలి వెళ్ళటానికి వారి కాళ్ళు నిరాకరించాయి. కానీ అక్కడి జనం, ఆ హాలు, ఆ మౌనం, ఆశ్రమ వాతావరణం - ఇవన్నీ వారికి ఎంత వెగటు కలిగించాయో జ్ఞాపకం రాగానే వారికి అక్కడ ఉండాలని అనిపించలేదు.

తిరిగి విజయవాడ చేరుకున్న చలం గారి సంతానం మహర్షి గురించి అడిగారు. ఆశ్రమంలో వారు చూసినదంతా ఉన్నది ఉన్నట్లుగా వాళ్ళకి చెప్పి, శ్రీభగవానుల తత్వాన్ని కూడా చెప్పే ప్రయత్నం చేశారు చలం గారు. వారి మాటలు సౌరిస్ అని పిలువబడే వారి పెద్ద అమ్మాయిని ఎంతగానో ప్రభావితం చేశాయి.

తండ్రిగారి నోటివెంట భగవాన్ గురించి విన్న సౌరిస్‌కు, వారిని దర్శించుకోవలెనన్న కోరిక తీవ్రంగా కలిగింది. మొట్టమొదటిసారి (1938 సంవత్సరంలో) ఆమె శ్రీభగవానులను దర్శించుకున్నప్పుడు, సౌరిస్ భగవానుల సన్నిధిలో ఎంతో ఉన్నతమైన ధ్యానస్థితిలోకి వెళ్ళిపోయారు. కానీ చలంగారికి భగవాన్ సమక్షంలో అటువంటి అనుభవాలేమీ కలుగలేదు. కొన్నిసార్లు భగవాన్ ముందు ధ్యానంలో కూర్చోవటానికి ప్రయత్నించినప్పుడు వారి నరాలన్ని నొప్పికి గురైయ్యేవని చలంగారికి అనిపించేది. అయినా, భగవానులనే చూస్తూ, అదేపనిగా వారి ముందు గంటల తరబడి చలం కూర్చునేవారు. అందుకు కారణం, భగవాన్, వారి అనుగ్రహాన్ని తప్పక కురిపిస్తారనే ప్రగాఢ విశ్వాసం.

ఇలా తమ ముందు కూర్చోవటాన్ని గమనించిన భగవాన్ ఒకటికి రెండుసార్లు ''అతను అదే పనిగా ఇలా కూర్చుంటా డెందుకు'' అని ఎవరినో అడగటం విన్న చలంగారికి అర్థమైన విషయమిది. ''నన్ను కేవలం తదేకంగా చూడటం వలన లభ్యమయ్యేది ఏముంటుంది? తనకై తాను కృషి చేసి ఆధ్యాత్మిక పురోభివృద్ధిని సాధించాలి'' అని శ్రీభగవాన్ తనకు సూచిస్తున్నట్లుగా చలంగారికి అనిపించింది.

యథాలాపంగా ''నేను ఎవరిని'' అనే చింతనని ప్రారంభించిన చలంకు సత్ఫలితాలు కనబడసాగాయి. చాలాసార్లు వారి ప్రమేయమే లేకుండా ''ధ్యానం'' ముంచెత్తుకొని వచ్చి వారిని కూర్చోపెట్టేది. ఇదంతా శ్రీ భగవానుల అనుగ్రహం వల్లనే జరుగుతోందని వారికి సుస్పష్టమైనది. ఇలా తరచూ జరగడం వలన

వారికి భగవాన్‌పై నమ్మకం కలిగింది. ఆధ్యాత్మిక ఆశలు చిగురించాయి. శ్రీభగవానులే తనకు మార్గం చూపుతున్నారనీ, రక్షిస్తున్నారనీ గట్టి నమ్మకం చలంగారికి కలిగింది.

అరుణాచలం వెళ్ళి శ్రీరమణాశ్రమం వెళ్ళిన ప్రతీసారీ, చలం హాలులో చాలాసేపు శ్రీభగవానులను చూస్తూ గడుపుతుండే వారు. శ్రీ భగవాన్ వారికి ఎప్పుడూ ఒక చిక్కు ప్రశ్నగానే ఉండిపోయారు. సాధారణ భక్తులు భగవాన్ వంటి జ్ఞానుల స్థితిని అర్థం చేసుకోలేరు కనుక ఇది అంత ఆశ్చర్యపడాల్సిన విషయమేమీ కాదు.

జ్ఞానిని అంచనా వేయటానికి ఏ కొలమానమూ లేదు. మనస్సు నశించని వారం కాబట్టి మనం జ్ఞానులను అర్థం చేసుకోలేము. జ్ఞాని ప్రవర్తనలో కనబడే పరస్పర వ్యతిరేకతల్లో ఏవో కారణాలను వెతకటానికి ప్రయత్నించడం మన అజ్ఞానం వల్లనే" అని చలంగారు తెలుసుకున్నారు.

1949వ సంవత్సరంలో చలంగారి వదినగారు మరణించారు. ప్రపంచంలో వారికి ఉన్న చివరి బంధం కూడా తెగిపోయిందని వారు భావించి, అరుణాచలానికి వెళ్ళి అక్కడే స్థిరపడాలని నిశ్చయించుకున్నారు. ఆ రోజులలో ధనం, రాబడి, స్నేహితులు - ఎవరూ లేని చలంగారికి కేవలం వున్న ఒకే ఒక్క ఆసరా - శ్రీభగవాన్‌లు మాత్రమే. కానీ రాబడి లేని చలం, అరుణాచలంలో రోజులు ఎలా గడుస్తాయని చింతింపసాగారు. ఆ రోజుల్లో శ్రీభగవాన్, తమను నమ్ముకున్న వారి అవసరాలను తీరుస్తారనే నమ్మకం చలం గారికి ఉండేది కాదు. అయినా, వెళదామని నిశ్చయించుకుని 1950వ సంవత్సరంలో అరుణాచలం

చేరుకున్నారు. అప్పటికే శ్రీభగవాన్ ఆరోగ్యం బాగా క్షీణించింది. ఎంతో అనారోగ్యంగా ఉన్నప్పటికీ, చలం గారిని ఎంతో ఆప్యాయంగా పలకరించి, "మీ రాకకై ఎదురుచూస్తున్నాను", అన్నట్లుగా భగవాన్ ఆయనను స్వాగతించారు. శ్రీరమణాశ్రమం వద్ద వుండాలని, ఒక చిన్న గుడిసె అద్దెకు తీసుకున్నారు చలం. కానీ వాళ్ళు అరుణాచలానికి వెళ్ళిన కొన్ని వారాలకే శ్రీభగవానులు దేహాన్ని విడిచిపెట్టారు. భగవాన్ సన్నిధిలో మరణాన్ని పొందాలని కాంక్షించి వచ్చిన చలంకు, భగవాన్ దేహం విడిచిపెట్టి, అరుణాచలంలో ఐక్యం కావడం చూడవలసి వచ్చింది. అయినప్పటికీ శ్రీభగవాన్ వారి భక్తులను ఎల్లప్పుడూ రక్షించి, అనుగ్రహిస్తారనే విశ్వాసం చలంగారికి ఉండేది.

భగవాన్ మహానిర్వాణం తర్వాత వారిని ఆవరించిన ఒంటరితనాన్ని భరించే శక్తిని శ్రీభగవానులే తమకు అనుగ్రహించారని చలంగారు అన్నారు. నేను ఎక్కడికి వెళ్ళిపోతాను? ఇచ్చటనే ఉంటాను అనే శ్రీభగవానుల వాక్కులను పరిపూర్ణంగా నమ్మినవారు శ్రీచలం. సౌరిస్ మరియు శ్రీచలం, 30 సంవత్సరాలు శ్రీరమణాశ్రమం వద్దనే సాధనాపూరితమైన జీవనాన్ని కొనసాగించారు. 1979లో చలం అరుణాచలంలో కన్నుమూశారు. శ్రీరమణాశ్రమానికి ఎదురుగా ఉన్న విఘ్నేశ్వరుని దేవాలయానికి ఆనుకుని ఉన్న మార్గంలో, బోస్ కాంపౌండ్ వద్ద చలంగారి సమాధి కనబడుతుంది.

## Gaining Contentment

Dr.K.Subrahmanian (Talk 3)

We have a mind, and because it is seeking something or the other, pleasant or unpleasant, there is always ceaseless activity. On some days, you don't want to go out anywhere, you are not interested in meeting anyone; you are not interested even in reading or in doing anything. But for a short period, you are very happy. Now at that time, the usual mind does not operate. You are not into anything, but you are happy with what you have. However, much of our time, much of our waking time, we want this and that. Our whole life is spent in seeking something that we think will give us pleasure. We work for our promotion, maybe for about one or two years. We are unhappy till we get our promotion. The day we get our promotion, we are extremely happy and share our happiness with other people by distributing sweets, and so on. But this happiness lasts for perhaps a week or so. You are conscious about your position for may be a month or two. Soon, it becomes a routine. The excitement that you had when you got your promotion is not there. And then, you want to do certain things in order to get your next promotion. And so, our whole life is spent in seeking something or the other. Nobody is happy with what he or she has.

The moment you are happy with what you have, the moment you are happy with what you don't have, and there is contentment, you are an emperor. In fact, you are greater than an emperor because even the emperor is

unhappy since he is afraid that somebody from outside will conquer his kingdom. The greatest man is one who accepts things as they come, enjoys them, and doesn't seek anything more. This kind of attitude is extraordinarily difficult, unless we have the grace of God. The man who is contented with what he has, neither gives up something nor seeks something; he accepts things as they come. He is the happiest man, whereas the man who is pursuing something, who is ambitious, greedy, is after power, fame and name, may appear to be successful from the point of view of other people, but he is miserable, because much of his time is spent in seeking all these, and he is constantly worried about success or failure. Such people flatter others, insult others, and they also accept insults from other people. And so Bhagavan says, as Krishna has said, and as Rama has said, "You have been assigned a particular duty; do it to the best of your ability. Don't think in terms of advance. Advance will come to you, if you are destined to have it. Don't do all the wrong things; don't spend your time doing this and that in order to have better prospects, or in order to have more money, scholarship, power or position."

If you accept yourself as you are, then you are the happiest person. We all think that successful people are those who don't have any problems; it is not so. Those who appear to be successful on the surface are actually miserable because they are constantly worried about whether they will retain their position and their money.

*Ma kuru dhana jana yauvana garvam*
*Harati nimeesaat kalah sarvam*
*Maayaa mayamidam akhilam hitvaa*
*Brahmapadam tvam pravisa viditvaa*

